

# 4 ఓటరు నవ్విన కారణం

మర్నాడు సుబ్బరాజు రాగానే రామిరెడ్డిగారు కథ వంటి కథ చెబుతా విను అని ఆరంభించాడు.

అనగనగా రెండు రాజ్యాలు. ఒకదాని పేరు శబ్ద రాజ్యం. రెండోది నిశ్శబ్ద రాజ్యం. దీనికి ఆ రాజ్యం వారీ పేరు పెడితే, దానికి ఈ దేశం వారు ఆ పేరు పెట్టారు. అసాధ్యపు విషయం అందిస్తానని ఆశపెట్టి, అందినట్టే నమ్మించి, దాని చుట్టూరా కవిత్వం పైత్యం అల్లి, ఊహా సౌధ చేస్తారని, అందువల్ల అది శబ్ద రాజ్యమనీ, నిశ్శబ్ద రాజ్యం వాదం. మీ దేశంలో గుప్‌చిప్‌గా ఉంటారు గాబట్టి మీది నిశ్శబ్ద రాజ్యం అన్నారు వీరు. మీది ఒకటే పార్టీ. రెండో అభిప్రాయం లేదు అని ఎత్తి పొడిచారు. మీదీ అంతే. అభిప్రాయం ఒకటే కాబట్టి పార్టీలు రెండైనా ఒకటి కిందే లెక్క. మళ్లీ మూడోది రాకుండా కట్టుదిట్టం చేసి ఇంకోదానికసలు ఆస్కారం లేనట్టు అభినయిస్తారు. మీవి రెండు పార్టీలయినా వాటి తాత్పర్యం ఒకటే. కాళ్లా గజ్జా కంకాళమ్మా వేగూ చుక్కా వెలగా మొగ్గా మొగ్గా కాదూ నూతికి నీరూ నీరూ కాదూ నిమ్మలవాయా... ఆట ఆడి ఏది మంచిదో తేల్చుకోవచ్చు అంటూ ఇవతలి వాళ్ళు దెప్పిపొడిచారు.

ఒకటి మాత్రం రైటే. ఆ రెండు పార్టీల్లో పేర్లను తప్పిస్తే పెద్ద తేడా ఉండదు. ఒక పార్టీలో రెండు గ్రూపుల్లాంటివవి. ఒకటి 'క' మరోటి 'ఖ'. రెండింటా దుర్మార్గులూ, సన్మార్గులు కూడా ఉన్నారు.

ఒకసారి ఒక వాడలో ఎన్నికలు వచ్చాయి. క, ఖ పార్టీల టిక్కెట్లు కొని ప్లాటుఫారం ఎక్కిన అభ్యర్థులు ఎవరికీ ఎవరూ ఎందునా తీసిపోనివారే. ఇద్దరూ ఆఫీసులో కుర్రాళ్ళుగా జీవితం ఆరంభించి కంపెనీల డైరెక్టర్లుగా వృద్ధికి వచ్చి రాజకీయాల్లోకి దిగజారిపోయారు. పంచవర్ష ప్రణాళికలు వేసుకుని వంతుల ప్రకారం వోసారి వారూ, వోసారి వీరూ అన్నట్టు పదవి కెగిరి ఉట్టికొడుతూ తొలి ప్రణాళికలో వ్యావసాయకాభివృద్ధి, రెండవ దానిలో పారిశ్రామికాభివృద్ధి, మూడవ దానిలో వర్తక వాణిజ్యాభివృద్ధి, నాలుగవ దానిలో అధికార సామ్రాజ్యాభివృద్ధి సాధించుకున్నారు – సొంతానికి.

ఎక్కువ డబ్బు గడించారన్న నెపంతో పన్నుల భారం కొద్దిమంది నెత్తిన వెయ్యడం

భావ్యం కాదని వాదించి, ఉత్తరోత్తరా తమ మునిమనవలు గడించే దాని మీద కూడా అట్టే పన్ను పడకుండా కట్టుదిట్టమైన చట్టాలు తెచ్చారు. సామాన్య పౌరులుగా, వర్తకులుగా, ఉన్నకాలంలో నూరింట యాభైపాళ్ళు అప్పైగా రాజావారి ఖజానాకిస్తే, ఇప్పుడు చట్టాలకు చుట్టుతిరిగి దోబూచులాడించడం ద్వారా నూటికి ఐదు వంతుల పన్నుతో సరిపెట్టడం మరిగారు. ఊరందరికీ మప్పారు. ఆ విధంగా వారిద్దరికీ ఆ వాడలో చాలామందికి ఎంతో ఋణపడి ఉన్నారు. 'దొంగాట' ఆడటంలో ఒడుపులు తెలియడమే ప్రజాస్వామ్యంలో తాత్పర్యం అన్న ధర్మాన్ని ప్రతిష్టించారు. అందువల్ల తప్పు చెయ్యడం తప్పు కాదనీ, దొరికిపోవడమే తప్పు అనీ, చేతకానివాడు ఆటలో ఉంటే ఆట చెడుతుంది కాబట్టి వాణ్ణి ఖైదులో దాచేసి ఆటచూస్తూ కొత్త ఒడుపులు ఆలోచించుకుందుకు సావకాశం కలిగించాలనీ, ఇలా అందరికీ సమానావకాశాలు కలిగించడమే ఈ వ్యవస్థలో గొప్పదనమనీ శాస్త్రం ఏర్పరచారు. దాన్ని చట్టాల మీదకు వ్యాఖ్యానాలుగా రూపొందించి చక్కగా విషయం ప్రస్తరించారు.

ఈ విద్యలో దీని ప్రయోగంలో ఆ ఎన్నికకు నిల్చిన అభ్యర్థులిద్దరికిద్దరూ ఘనులే. అందువల్ల ఎవరికి ఓటు చెయ్యాలీ అన్నది అక్కడి ప్రజలు ఓ పట్టాన తేల్చుకోలేక పోయారు. లాటరీలు వేసుకునీ, కండచీమల చేత ఏదో ఒక చీటీ ముట్టించీ, కాళ్లాగజ్జా కంకాళమ్మా ఆడీ, రెమ్మలు పట్టుకునీ "ఐ లైక్ యూ, ఐ లైక్ యూ నాట్" అంటూ ఒక్కొక్క ఆకే తుంచేసే దొరల పద్ధతి మీద ఎవరికి ఓటు వెయ్యాలీ, ఫలానా వాడికి వెయ్యాలా కూడదా అనే మహా సమస్యను పరిష్కరించుకోసాగారు. ఈ లాటరీ పద్ధతి మీద నమ్మకంలేక సొంతంగా ఆలోచించాలని సరదాపడ్డ జనులు తమచేత 'ఆలోచింపజేయడానికి' సైకాలజిస్టులు – అంటే మనస్తత్వం గ్రహించి మన మనసులో మాట ఏమిటని తమ మనసులో తోచిందే చెప్పి ఒప్పించే ఇంద్రజాలికుడన్నమాట – వాళ్ళ దగ్గరకెళ్ళారు. మళ్ళీ పాపం ఆ ఖర్చు మీరేం పెట్టుకుంటారని, ఎన్నికల అభ్యర్థులే సొంత ఖర్చు మీద వీధివీధినా సైకాలజిస్టు షాపులు తెరిపించి ఉచిత వసతి ఏర్పరచి వాళ్ళద్వారా నిర్ణయం చేయించారు.

ఇవన్నీ చూసి ఈ పద్ధతులు అనుసరించడం, వసతులు వాడుకోవడం చేతగాక తికమక పడుతున్న బిసి పౌరుడొకడు ఎటూ తేల్చుకోలేక ఇంట్లోనే ఉండిపోయాడు. అవతల పోలింగుకు వేళ పూర్తి కావచ్చింది. ఊళ్ళో పిల్లా మేకా అంతా ఓట్లు వేసేశారు. అప్పటికి తేలిన లెక్కలు చూడగానే అంతా హాహాకారాలు చేశారు. అభ్యర్థులిద్దరికీ చెరి సమానంగా పడ్డాయి ఓట్లు, ఎవరు గెలిచినట్లు? ఎవరికీ ఏమీ పాలుపోలేదు. ఇంత ప్రయాసా, ఇన్ని లక్షల ఖర్చూ దండగ అయిపోతుంది. ఓటువేసిన వారెవరైనా ఉపసంహరించుకొంటే బాగుండునని తోచింది. ఇంకో గంట టైముందనగా తిరిగి ప్రచారం సాగింది. ఉధృతంగా, ఓసారి మీ ఓటు నాకు వెయ్యండి, నేను మీకు ఫలానా పన్ను చేసి పెడతాను. విదేశాంగ శాఖలో ఉద్యోగం వేయిస్తాను. అందులో మీరు గిట్టని వాళ్ళుంటే వాళ్ళను బర్తరఫ్ చేయిస్తాను. నా ప్రత్యర్థికింత ప్రజ్ఞ లేదు అనే ప్రచారం బదులు కొత్త నినాదం అరంభమైంది. వాడికేసిన ఓటు లాగేసుకోండి, తూ నా బొడ్డు అనండి. మీలో ఏ ఒకరైనా మీది లోసుగు ఓటు అని ప్రకటించండి. నిన్న రాత్రి మూడు ఖూనీలు చేశాననండి. చెప్పరాని పార్టీ మనిషిననండి. విదేశవాళీ

గూఢచారి ననండి. మీరు ఓటేసిన వ్యక్తి ఎంత దుర్మార్గుడో మీకు బొత్తిగా తెలీదు. వాడింట్లో పెద్ద కుక్క వుంది మీరు అక్కడికెళ్తే కరుస్తుంది... ఆఁ! మా కుక్కా! మా కుక్కను గంటలో చంపేస్తానుగా! లేదా పళ్ళు పీకించేస్తాను... అసలు మీరు ఓటేసిన వాడివి కట్టుడు పళ్ళు మీకు తెలుసో తెలీదో. అంతెందుకూ వాళ్ళింటోకెళ్లి ఆ పుస్తకాలు ఓసారి చూస్తే సరి – వాడికి ఓటు వేయడం ఎంత పొరబాటో, ఎంత దేశద్రోహమో మీకే తెలుస్తుంది. అసలు వాడి ఆస్తెంత. అన్నీ కలిపి పాతిక కార్లు లేవు. వంద మేడలు లేవు. లక్ష ఎకరాల మించి భూమి లేదు. అంతా హంగు బోలెడున్నట్టు. అంచేత ఎలాగైనా వాడికి మీరు వేసిన ఓటు ఉపసంహరించుకోండి... అంటూ శతకోటి విధాల ప్రచారం చేశారు. పోలింగుకు ఇంకో పది నిమిషాలు టైముందనగా హఠాత్తుగా తెలిసింది – ఒక దౌర్భాగ్యుడు, మూర్ఖుడు లేదా ఒక జీనియస్, ఒక దేశరక్షకుడు, ఒక మహా పౌరుడు ఇంతవరకూ ఓటు వెయ్యలేదని తెలిసింది. అతను ఎటూ తేల్చుకోలేక గోళ్ళు తినేస్తున్నాడనీ ఇంకాసేపుంటే వేళ్ళు తినేస్తాడనీ ఆనక ఓటు కాయితం పట్టుకుందుకు వేళ్ళుండవనీ త్వరగా వెళ్ళి వాణ్ణి కేకేసుకొచ్చి ఓటు వేయించాలనీ అన్నారు. అయితే కాసేపు ఆగుదాం. 'మొండి చేతులతో ఓటు వేసిన పౌరుడు' అని డ్రమెటిక్‌గా ఫోటోలు తియ్యొచ్చు అన్నారు పత్రికల ఫోటోగ్రాఫర్లు, ఎడిటర్లు కూడా వాళ్ళను బలపరచి సంపాదకీయాలు రాశారు. లిప్‌సర్వీస్‌మెన్ పుంజుకున్నారు. ఈ ధోరణిని హేళన చేస్తూ బ్రిటన్ వ్యంగ్య వ్యాసాలు ప్రచారం చేసింది. అక్రూరసమితి ఊరేగింపు జరిపింది – ఆ వోటరుచేత గోళ్ళూ వేళ్ళూ తిననివ్వడం ఘోరమని. పౌరహక్కుల సమితి మేలుకుని నిరసించింది – ప్రతివాడికి తన గోళ్ళూ వేళ్ళూ కొరుక్కు తినే హక్కు ఉండాలి, అది ఓటింగు మీద అతని అభిప్రాయం ప్రకటించడం కిందకి వస్తుంది. కాబట్టి రాజ్యాంగ రీత్యా అభిప్రాయ స్వాతంత్ర్యం రక్షించాలని వాదించింది. గోళ్ళు – రాజ్యాంగం అనే గ్రంథం త్వరలో ప్రకటిస్తున్నట్టు ప్రకటించింది. పాక్ అధ్యక్షుడు అమెరికా ఇండియాకు తోడ్పడరాదని తీవ్రంగా ప్రకటన చేశారు. రాజాజీ స్వతంత్ర పార్టీ లక్ష్యాలను వివరించారు. ఈ లోపల ఎన్నికల అభ్యర్థులు, వారి మందీ మార్బలం ఆ ఓటరు ఆచూకీ కనుక్కుని వెళ్లి అతన్ని మోసుకు వచ్చేశారు పోలింగు బూత్ దగ్గరికి. వెయ్యి ఓటు వెయ్యి అన్నారు. ఇద్దరూ తుదిసారిగా చెరొక నిమిషం తమ శక్తిని, వాగ్ధాటిని, బుర్రను వాడేసి ఇరవై సెకండ్లలోనూ అరవై రోజుల ప్రచారసారం ఇమిడ్చి మాట్లాడారు – ఓటు ఎదటి వెధవ గారికి ఎందుకు వెయ్యరాదో వివరిస్తూ, చివరికి ఉభయపక్షాల తరఫునా గొప్ప పదవులలో ఉన్న పెద్ద నాయకులిద్దరి చేతా ఇద్దరికిద్దరూ ట్రంకు టెలిఫోన్లు తెప్పించి వాటి ద్వారా ఓటరుకు చెప్పించారు.

ఓటరు బాలట్ కాగితం పట్టుకుని ఒకసారి కళ్ళు మూసుకున్నాడు నీరసంగా. తరవాత భోరున ఏడ్చాడు చొక్కా తడిసిపోయేలా. ఉత్తర క్షణంలో ఆనందంతో నవ్వాడు. ఉత్సాహంగా లోపలకెళ్ళి ఇట్టే ఓటు వేసి చక్కా వచ్చాడు.

"సుబ్బరాజా! ఆ వోటరు ముందర ఎందుకు ఏడిచాడు? తరవాత ఎందుకు నవ్వాడు? ఏమిటా కులుకు? ఎందుకా ఆనందం? చెప్పు చూతాం" అన్నారు రెడ్డిగారు కథ ఆపి.

"అసలు ఈ ఎన్నికలలో స్వతంత్రం అనేది చాలా కొద్ది. ఓటరు తనకు నిజంగా యోగ్యుడు అని తోచిన వాడికి ఓటువేసే అవకాశం లేదు. అంగబలం, అర్ధబలం, ఉండి పోటీకి నిలబడ్డ వారిలో మాత్రమే తనకు నచ్చిన వాడిని ఎన్నుకోవచ్చు. ఎవడూ నచ్చకపోతే తన అభిప్రాయం చెప్పే అవకాశం లేదు! ఎందుకూ...

ఈ ఎన్నికలలో ఇద్దరూ మహా దుష్టులే అయినా తాను ఓటు చేసి తీరాల్సిన దుర్గతి పట్టినందుకు అతను ఏడిచాడు. పోతే –

"ఇద్దరు వెధవల్లోనూ తన ఓటువల్ల ఎవరో ఒక్కడు మాత్రమే ఎన్నిక అవుతున్నాడు కదా అని ఆనందంతో ఉప్పొంగిపోయి పకాలున నవ్వాడు" అన్నాడు సుబ్బరాజు.

"ఇంతకూ ఆ వోటరు మీదా, వాడి ఊహ మీదా నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు రెడ్డిగారు తువ్వాలుతో ముఖం మీద పొయ్యని చెమటా, పోసిన అభిప్రాయాలూ తుడిచేసుకుంటూ.

"వాడు వట్టి మూర్ఖుడు. బి.సి. మనిషి. ఇలాంటివాడ్ని ఏ అండమాన్సో, సైబీరియానో తోలెయ్యాలి" అన్నాడు రాజు.

★ ★ ★